# త్వరలో మరో మూడు పథకాలు

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం..
- మహిళలు ఆర్థికంగా ఎదగేందుకు సీఎం ప్రత్యేక చొరవ
- జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** ఇచ్చిన హామీలన్నిటిని ఒక్కొక్కటిగా అమలు చేసి తీరుతామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని ఆమె తెలిపారు. మంగళవారం ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారులోని జాతీయ రహదారి నుంచి సీఆర్పిఎఫ్ బెటాలియన్ వరకు రూ.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.50 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, ఇంచర్ల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇచ్చిన హామీలలో కొన్ని పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని, రానున్న రోజులలో రైతు బంధు, రైతు భరోసా, మహిళలకు రూ.2,500, పింఛన్ పెంపు పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడం కొందరికి నచ్చడం లేదని, పేద మహిళలు ఆర్థికంగా నష్టపోకుండా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ జనవరి మాసం నుండి సన్న బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సన్న వడ్లు పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ సైతం ప్రభుత్వం అందిస్తున్నదని అన్నారు. ఇప్పటికే 18 వేల కోట్ల రూపాయలను రైతు రుణమాఫీ పథకంలో పంపిణీ చేశామని, రానున్న రోజులలో మరో 10 వేల కోట్ల రూపాయలు కేటాయించి రుణమాఫీ కానీ రైతులకు అందిస్తామని అన్నారు. ఇంచర్ల గ్రామంలో ఐదు కోట్ల రూపాయలతో జిల్లా సమాఖ్య భవనాన్ని నిర్మిస్తామని, జిల్లా పర్యాటక ప్రాంతంగా పురోగతి చెందుతున్నదని దానికి అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని మంత్రి తెలిపారు. భవన, రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హాజరైన అధికారులతో గ్రామ ప్రజలతో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు.

### దళారులను నమ్మి మోసపోవద్దు..

మధ్య దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు అని డాక్టర్ సీతక్క రైతులకు సూచించారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో సహకార సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతు బాగుంటేనే ఈ రాష్ట్రం, దేశం భాగుంటుందని అన్నారు. సన్న ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ బోనస్ రూ.500 చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోథ్ రవి చందర్, సహకార సంఘం చైర్మన్ బొక్క సత్తి రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రాజుతో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జోడెడ్లుగా అభివృద్ధికి కృషి చేస్తున్నాం..

**వరంగల్ వాయిస్, గణపురం :** భూపాలపల్లి నియోజకవర్గం అభివృద్ధికి తాను, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కలిసి జోడెడ్లుగా కృషి చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి రేవెంత్ సర్కార్ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించడానికి అహర్నిశలు పాటుపడుతున్నామన్నారు. రూ.25 కోట్లతో శంకుస్థాపనలు, వెలుతుర్లపల్లి కొండాపురం మోరంచ హై లెవెల్ బ్రిడ్జి, గణపురం ధర్మరావుపేట రోడ్డు రూ.10 లక్షలతో నిర్మించనున్న, ఎల్లమ్మ తల్లి గుడి మంత్రి సీతక్క ఎమ్మెల్యే సత్యనారాయణ రావు తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, తాసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు డి శంకర్, అశోక్, సత్తిరెడ్డి, అశోక్, వి.నారాయణ, ఎం.శివశంకర్ గౌడ్, కృష్ణ, కె.శ్రీనివాస్, భువన సుందర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు సుభిక్షంగా ఉండాలి

## గ్రామ దేవతలను దర్శించుకున్న రవికుమార్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఖిలా వరంగల్ పడమర కోటలో శ్రీ భూలక్ష్మి, శ్రీలక్ష్మి సమేత నాభిశీల బొడ్రాయి పంచమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవతలను కోరుకున్నటు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి కమిటీ అధ్యక్షులు ఇనుముల మల్లేశం, ప్రధాన కార్యదర్శి తోటకూరి నరసయ్య, కోశాధికారి గజ్జెల శ్యామ్, కార్యనిర్వహక అధ్యక్షులు పుప్పాల రాజేందర్, ఇనుముల అరుణ్ తో పాటు బీజేపీ 38వ డివిజన్ అధ్యక్షులు అంకాల జనార్ధన్, సీనియర్ నాయకులు ఇనుముల రాజు, రేపల్లె స్వర్ణజ, తోటకూరి రాజేశ్వరి, బోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 27న చలో హైదరాబాద్

## ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జాతీయ ఆరోగ్య మిషన్ అల్ ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్, రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం అమలుకు ఈ నెల 27 బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ లోని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కార్యాలయానికి క్యాడర్ కు ఒక్కరు చొప్పున తరలి రావాలని ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల సాధనకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఎన్ హెచ్ఎంలోని 78 విభాగాల్లో పనిచేస్తున్న 17,514 ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి క్యాడర్ కు ఒక్కరు చొప్పున మొత్తం 78 క్యాడర్స్ ఉద్యోగులు 78 మంది పాల్గొని విజయవంతం చేయవలసిందిగా రాజేష్ ఖన్నా కోరారు.

# డిసెంబర్ 1న గంపాస్ డిస్కాన్ 2024

## శ్రవణ్ స్వప్న సందీప్ సేవా పురస్కారాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ 'గంపాస్ డిస్కాన్ – 2024' (శ్రవణ్ స్వప్న సందీప్ సేవా పురస్కారాలు) పేరిట డిసెంబర్ 1వ తేదీ ఆదివారం 24వ వాసవీ క్లబ్ జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా గవర్నర్ గంపా సాంబమూర్తి వెల్లడించారు. హంటర్ రోడ్డులోని గోల్డెన్ గార్డెన్ లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో డిస్ట్రిక్ట్ వి101ఎ పరిధిలోని 63 క్లబ్బులు 2024లో చేసిన సేవలకు గాను వారికి అవార్డులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. 63 క్లబ్బుల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులతో సహా హాజరై బ్యానర్ ప్రెజెంటేషన్ చేసి అవార్డులు స్వీకరించాలని సాంబమూర్తి కోరారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ పూర్వ అధ్యక్షులు యాద నాగేశ్వర్ రావు హాజరవుతున్నారని, కాన్ఫరెన్స్ చైర్మన్ గా గార్లపాటి శ్రీనివాసులు వ్యవహరిస్తున్నారని వాసవియన్లు అధిక సంఖ్యలో హాజరై ఈ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సాంబమూర్తి పిలుపునిచ్చారు.

# రైల్వే గేట్ బడిలో రాజ్యాంగ దినోత్సవం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని పెరికవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. అంతకు ముందు పాఠశాల స్కూల్ అసిస్టెంట్, బీసీటూయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్రిడ్జీ పనులకు సుముఖత



## పరిశీలించిన ప్రభుత్వ విఫ్ రాంచంద్రు నాయక్

## వరంగల్ వాయిస్ ఎఫెక్ట్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మండలంలోని వెన్నారం, తొడెళ్లగూడెం మార్గ మధ్యలో అసంపూర్తిగా ఉన్న హై లెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ మంగళవారం పరిశీలించారు. బ్రిడ్జి పూర్తిగా నిర్మాణం చేసేందుకు కావాల్సిన నిధులపై పీఆర్ డీఈ జుంకీ లాల్ తో వాకాబు చేసారు. రూ.2 కోట్ల అదనపు అంచన విలువ తో కూడిన నిధుల మంజురీకై ఉన్నత అధికారుల నివేదించామని వారి అనుమతి కోసం నిరీక్షిస్తున్నామని డీఈ తెలిపారు. దీనిపై అధికారులతో చర్చించి బ్రిడ్జిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com